క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో కృష్ణ భగవానుడు

కంచరపాలెం: స్థానిక విఘ్నేశ్వర మహలక్ష్మి సహిత శ్రీకృష్ణ మందిరం 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జలాభిషేకం, 108 కలశాల తో క్షీర పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకణ, గరికపూసలు, మారేడు దళాలతో సామర్చాన, అన్నాభిషేకా లు, ప్రత్యేక అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ నాయకులు కృష్ణ భగవానుని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు 2 వేల మందికి భారీ అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా ఏపీఈపీడీసీఎల్


నూతన బ్రేకర్స్‌ను ప్రారంభిస్తున్న ఈఈ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూసేందుకు ఏపీఈపీడీసీఎల్ చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్‌లోని 33/11 అక్కయ్యపాలెం సబ్ స్టేషన్ నుంచి అబిద్‌నగర్‌కు విద్యుత్ సరఫరా చేసే పాత బ్రేకర్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ(ఆపరేషన్స్) ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ కె.సత్యప్రసాద్, డిప్యూటీ ఈఈ ఉదయ్‌కిరణ్, ఏఈఈ జి.గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు కౌంటర్ తొలగింపు


సీతమ్మధార రైతుబజార్ గేటు పక్కన పేపర్ సంచుల విక్రయ కౌంటర్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన పేపర్ సంచుల విక్రయ కౌంటర్‌ను ఎట్టకేలకు తొలగించారు. ఈ కౌంటర్ ఏర్పాటు వల్ల కొందరు రైతులు గేటు బయట కూరగాయలు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి 'సాక్షి' తీసుకురాగా.. ఆయన ఆదేశాల మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రైతులు యథావిధిగా బజారు లోపల కూరగాయలు విక్రయిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి బీమా పరిహారం


మృతుడి భార్యకు బీమా సొమ్ము అందిస్తున్న సచివాలయ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు 232 సచివాలయం పరిధి వెంకటరాజునగర్‌లో నివసిస్తున్న షేక్ నజీర్ ఇటీవల మరణించాడు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ బీమా తక్షణం సాయం కింద మృతుడి భార్య షేక్ మున్నీకి రూ.10 వేల నగదును సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మక్కువ ఉదయ్‌కిరణ్ అందజేశారు. వలంటీర్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ముస్లిం తాటిచెట్లపాలెం, అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, ఏఎస్ రావు నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

గ్రీన్ బెల్ట్‌కు మహర్దశ


హైవేపై సత్యం సెంటర్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్

- హైవేలో జోరుగా సుందరీకరణ పనులు
- డివైడర్లకు రంగులు, మొక్కల సంరక్షణ

సీతంపేట: జాతీయ రహదారికి మణిహారంలా ఉన్న గ్రీన్ బెల్ట్‌కు మహర్దశ పట్టింది. వచ్చే నెల నగరంలో జీ20 సదస్సు జరగనున్న తరుణంలో దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి హనుమంతవాక వరకు గల హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్, డివైడర్ల సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రీన్ బెల్ట్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ చాలా చోట్ల ధ్వంసమైంది. ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. జీ20 సదస్సు పుణ్యమా అని సుందరీకరణలో భాగంగా గ్రీన్ బెల్ట్ కొత్త శోభను సంతరించుకుంటోంది.

సత్యం సెంటర్ టు పంజాబ్ హోటల్..

ఉత్తర నియోజకవర్గ పరిధిలో సత్యం సెంటర్ నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు హైవేకు ఆనుకున్న గ్రీన్ బెల్ట్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పొక్లెయిన్లతో తొలగించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో సుమారు అడుగు మందంలో గ్రావెల్ పరుస్తున్నారు. ఫెన్సింగ్ పోయిన చోట కొత్తగా ఐరన్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఉన్న గ్రిల్స్, గోడలకు పెయింటింగ్ వేస్తున్నారు. మొక్కల సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.


జాతీయ రహదారిలో డివైడర్ గ్రిల్స్‌కు రంగులు వేస్తున్న పెయింటర్

పొడవైన వాకింగ్ ట్రాక్ నిర్మాణం..

సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌ను చదును చేసి రెండు మీటర్ల వెడల్పు, 509 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. కాంక్రీట్‌తో ట్రాక్ నిర్మించి మధ్యలో గ్రావెల్ పరుస్తామని సిబ్బంది తెలిపారు. హైవేపై ఇంత పొడవైన వాకింగ్ ట్రాక్ ఇదే మొట్టమొదటిదని తెలిపారు. కార్పొరేటర్ల ఏడాది పదవీ కాలం పూర్తయిన సందర్భంగా వార్డు అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఇదే గ్రీన్ బెల్ట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దాని పక్కనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటవుతుండటంతో వ్యాయామానికి అనువుగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా పెయింటింగ్ పనులు

మద్దిపాలెం: ఆర్ అండ్ బీ కూడలి నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు జాతీయ రహదారిలో సుందరీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వరుసగా రెండు రోజుల పాటు ఈ ప్రాంతంలో పర్యటించి హైవే ఆధునికీకరణ, సుందరీకరణ పనులను స్వయంగా పరిశీలించారు. డివైడర్లకు రంగులు వేయడం, పచ్చని చెట్ల మధ్య పారిశుధ్య పనులను కార్మికులు శరవేగంగా చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా కొత్త శోభను సంతరించుకుంది.


పంజాబ్ హోటల్ జంక్షన్ దరి డివైడర్‌కు వేసిన రంగులు

సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి


సమీక్ష నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జుల నియామకం, ఎన్నికల ప్రచారంపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీతంరాజు విజయానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. పట్టభద్రులను కలిసి ప్రభుత్వ పనితీరును వివరించాలన్నారు. వార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి సమస్యలేమైనా ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటిని సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్చి 1న పెన్షనర్ల ఇళ్లకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వెళ్లి పింఛన్లు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్స్ బర్కత్ అలీ, సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, కె.వి.ఎన్.శశికళ, వార్డు అధ్యక్షులు పైడి రమణ, షేక్ జుబేర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


47వ వార్డులో పట్టభద్రురాలికి కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి


శ్రీనివాసనగర్‌లో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా సోమవారం 44వ వార్డు 80 ఫీట్ రోడ్, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సీతారామరాజు, విజ్జు సీతారామ్, ఎం.గోపి, పి.గోపి, శ్రీను, దుర్గ, హైమ తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి శ్రీనివాసనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేసి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

42వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, డైరెక్టర్లు ఎస్.ప్రసాదరావు, నాగమణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

47వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్, కప్పరాడ, జైప్రకాశ్‌నగర్ అరుంధతినగర్, అంబేడ్కర్ ఎస్టేట్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా సోమవారం కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతంరాజుకు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను ఆమె కోరారు. కార్యక్రమంలో వసంతాల అప్పారావు, సురేష్, చందు, అనిల్, రమేష్, నాగేశ్వరరావు, కృష్ణ, గురువోజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్‌ను కలిసిన టీడీపీ అభ్యర్థి

మురళీనగర్: మురళీనగర్‌లో సోమవారం టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు పర్యవేక్షణలో 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో వైశాఖీ స్పోర్ట్స్ పార్క్, వాకర్స్ పార్క్, మాధవధార ఈస్ట్ పార్క్‌ల్లో పట్టభద్రులైన వాకర్స్‌ను చిరంజీవి కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జిల్లా పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి బొడ్డేపల్లి లలిత, పార్టీ జిల్లా కార్యదర్శి జాన్, జిల్లా పార్లమెంటరీ పార్టీ తెలుగు మహిళా అధికార ప్రతినిధి ప్రమీలరావు, నియోజకవర్గ బీసీ సెల్ ప్రెసిడెంట్ కోలా రామారావు, మాజీ కార్పొరేటర్ పాలమరశెట్టి శ్రీనివాసరావు, 50వ వార్డు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎస్.రామచంద్రరావు, 46, 14, 26, 47, 48 వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.


రైల్వే న్యూకాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

49వ వార్డులో..

మద్దిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు 283 సచివాలయం పరిధి అల్లూరి సీతారామరాజునగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆ ప్రాంతంలో పర్యటించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ఏఎస్సార్ నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఆడ పిల్లలకు బాల్యవివాహాలు చేయవద్దని, పిల్లలను పనికి పంపొద్దని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) సిబ్బంది హితవు పలికారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో స్థానిక సచివాలయ సిబ్బంది సహకారంతో సోమవారం డీబీఆర్‌సీ సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని, కనీసం 10వ తరగతి వరకు చదివించడం ద్వారా ప్రభుత్వ పథకాలు పొందుకోవచ్చని, ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని తెలియజేశారు. బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్న పిల్లలను చదువుకునే వయసులో పనికి పంపించడం కూడా నేరమని, వారిని చదివించాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్లు ఎల్.నిఖిల, కె.రాజు, సచివాలయ సెక్రటరీలు బొట్టా దేవి, మహిళా పోలీస్ అనిత, వలంటీర్ ధనలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

'స్పందన'కు 30 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం


అర్జీలు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎస్.రాజు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్‌కు 01, ఇంజినీరింగ్‌కు 03 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రజా వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయా విభాగాధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటుకు అప్పగించొద్దు


పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

తాటిచెట్లపాలెం: స్థానిక పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించాలని పోర్టు యాజమాన్యం ప్రయత్నిస్తోందని విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు పోర్టు ఆస్పత్రి సేవలందిస్తోందని, అటువంటి దాన్ని ప్రైవేటుపరం చేయాలనే ఆలోచన మంచిదికాదన్నారు. పోర్టు, డీఎల్‌బీ పెన్షనర్లకు ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలను మెరుగు పరచాలని కోరారు. గతంలో చేపట్టిన విధంగా ఏవోబీలో హోమియో వైద్యసేవలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ చౌదరి అప్పారావు, అడ్వయిజర్ ఎ.నారాయణరావు, సెక్రటరీ పి.ఎస్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కరాటే పోటీలు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గొర్లె చందు, నరవ రాంబాబు

కంచరపాలెం: కంచరపాలెం డీఎల్‌బీ కమ్యూనిటీ హాల్‌లో యంగ్ ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు గొర్లె పుష్పారావు, మొల్లి తులసీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ప్రథమ స్థానంలో వీవీవీ స్కూల్-స్టీల్‌ప్లాంట్, రెండో స్థానంలో రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్-మధురవాడ నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో విజేతలకు ముఖ్య అతిథులు నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, ఉత్తరాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఏప్రిల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సేవలు భేష్


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు త్రిఫ్ట్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2020 – 21, 2021 – 22 సంవత్సరాల్లో విద్యలో ప్రతిభ చూపిన 83 మంది విద్యార్థులకు రూ.2.48 లక్షల చెక్కులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీ పెరిగి మరింత ఉజ్వల స్థితికి చేరుకుంటారన్నారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పిల్లలు విద్యలో ప్రతిభ చూపి మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షులు కె.ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఓబీసీ కేటగిరీ వారికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. డైరెక్టర్లు కె.శ్రీనివాస్, బి.లాలూ, జి.వి.రమేష్, వి.జి.మహీదర్, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి, స్టీల్ సిటు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

చెట్ల కొమ్మలు తరలించండి


శంకరమఠం రోడ్డులో చెట్ల కొమ్మలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్డులో యూకే పార్లర్ ఎదురుగా చెట్టు కూలిపోయింది. స్థానిక యువత చెట్టు కొమ్మలు నరికి రోడ్డుకు ఒక పక్కన పడవేశారు. వారం రోజులు గడిచిన వాటిని తరలించలేదు. రోడ్డు సగానికి పైగా చెట్ల కొమ్మలు ఆక్రమించాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కింతాడ శ్రీను, లలితానగర్

కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్


కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ


మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

మహారాణిపేట: కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న వార్తలు వస్తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

జబర్దస్త్ నటుల సందడి


పీఎంపాలెంలో జబర్దస్త్ నటులు

కొమ్మాది: పీఎం పాలెం చివరి బస్టాప్ సమీపంలో జబర్దస్త్ నటులు దుర్గారావు, వరాలబాబు, దర్శకుడు పోతిన రమేష్ సందడి చేశారు. విజయనగరంలో జరగనున్న ఓ ఉత్సవానికి వెళ్తున్న తరుణంలో ఇక్కడి ఓ స్నేహితుడిని కలిసేందుకు చేరుకున్నారు. వీరితో స్థానికులు సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు.

నేడు ఎల్లమ్మ తొలేళ్లు.. రేపు జాతర

డాబాగార్డెన్స్: భక్తులు కొంగుబంగారంగా కొలుచుకునే ఎల్లమ్మ వార్షిక జాతర మంగళ, బుధవారాల్లో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి, జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పద్మావతి తెలిపారు.